రేషన్.. పరేషాన్



- పూర్తి స్థాయిలో అందని సరుకులు
- కందిపప్పు లభించక కార్డుదారుల గగ్గోలు
- పండగ పూటా పట్టించుకోరా అంటూ ఆవేదన
- ప్రజల గోడు పట్టని కూటమి ప్రభుత్వం

అల్లిపురం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతి నెల 1 నుంచి 10వ తేదీలోగా రేషన్ సరుకులు ఠంచన్‌గా అందజేసేది. వలంటీర్లు దగ్గరుండి మరీ మీకు ఫలానా సమయానికి రేషన్ బండి మీ వీధిలోకి వస్తుంది.. రేషన్ తీసుకునేందుకు సిద్ధంగా ఉండండి అని గ్రూపు మెసేజ్ పెట్టేవారు. ఆ సమయంలో ఖాళీ చూసుకుని లబ్ధిదారులు రేషన్ సరుకులు తీసుకునేవారు. కూలి పనులకు వెళ్లేవారు, ఇళ్ల నుంచి కదల్లేని వృద్ధులకు వలంటీర్ సహకారంతో రేషన్ అందజేసేవారు. ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారిని వెతుక్కుని వచ్చి మరీ రేషన్ అందజేసే బాధ్యత వలంటీర్లు తీసుకునేవారు. అలాంటిది ఇప్పుడు రేషన్ సరుకులు కూడా సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు నెలలుగా కనీసం పప్పన్నం కూడా తినే పరిస్థితి లేకుండా పోయింది. వచ్చే ఏప్రిల్‌లో కూడా కందిపప్పు అందే పరిస్థితి లేదని రేషన్ డీలర్లు వెల్లడించారు. ఇప్పటికే ఏప్రిల్ నెలకు సంబంధించి బియ్యం, పంచదార డిపోలకు చేరుకుంది. ఇక ఉగాదికి పప్పన్నం లేనట్లేనని అర్థమవుతోంది. కూటమి ప్రభుత్వం వరుసగా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో కందిపప్పు ఇవ్వకపోవడంతో కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్–2 పరిధిలో 152 రేషన్ డిపోలు ఉన్నాయి. జీవీఎంసీ 32,33,34 వార్డుల్లో 12 వరకు రేషన్ డిపోలు ఉన్నాయి.



రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)



అల్లిపురంలో రేషన్ సరుకుల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు (ఫైల్)

బియ్యంతో సరి..

ప్రతి నెల కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో రేషన్ డిపోల ద్వారా అన్ని రకాల పప్పులు రాయితీ ధరలకు ఇస్తామని హామీ ఇచ్చారు. వారు అధికారం చేపట్టి పదినెలలు కావస్తున్నా పూర్తి స్థాయిలో రేషన్ సరుకులు ఇవ్వలేకపోతున్నారు. రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గొడౌన్ల తనిఖీల సందర్భంగా తూకంలో తేడా ఉందన్న నెపంతో పంచదార, కందిపప్పు నిల్వలను వెనక్కి పంపేశారు. అంత వరకు బాగానే ఉంది. వరుసగా రెండు నెలల పాటు బియ్యం తప్ప రెండో సరుకు పూర్తిస్థాయిలో రాకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. దీనిపై కూడా చర్యలు తీసుకుంటే బాగుండును. కందిపప్పు ధర బహిరంగ మార్కెట్లో కిలో రూ.190 ఉండగా, సూపర్ బజారులో రూ.185, రైతు బజార్లలో రూ.150కి విక్రయిస్తున్నారు. రేషన్ డిపోల్లో కిలో కందిపప్పు రూ.67కే ఇవ్వడంతో డిమాండ్ అధికంగా ఉంది. కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తూ వ్యాన్ల వద్ద గంటల తరబడి వేచి ఉండేలా చేస్తున్నారని కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బియ్యంతో సరిపెట్టేశారు..

కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ సరుకులు పూర్తిస్థాయిలో అందడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ డిపోల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార ఇచ్చేవారు. గత నెల పంచదార కూడా ఇవ్వలేదు. ఈ నెలలో కొన్ని డిపోలకు మాత్రమే పంచదార వచ్చిందని చెబుతున్నారు. పండగల సమయంలో కూడా పంచదార, కందిపప్పు ఇవ్వకపోవడం సరికాదు. – ఎం. వెంకటలక్ష్మి, డిపో నంబర్–135, అల్లిపురం

ఉగాదికి కందిపప్పు ఇవ్వరా?

ఈ నెలలో ఉగాది పండగ ఉంది. పండగలు ఉన్నా కందిపప్పు ఇవ్వకపోవడం దారుణం. పేదోళ్లకు పండగ పూట పప్పన్నం కూడా దొరకని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అది చేస్తాం, ఇది చేస్తామనడమే తప్ప చేసిందేమీ లేదు. హామీ ఇచ్చినట్టు రేషన్ సరుకులు పూర్తి స్థాయిలో అందించాలి. – సీహెచ్ అప్పల నర్సమ్మ, డిపో నంబర్–169, అల్లిపురం

రేషన్ డిపోలు నిర్వీర్యం..

గత ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా అన్ని సరుకులు అందజేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ డిపోలు పటిష్టపరుస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కాని గత రెండు నెలలుగా కందిపప్పు పూర్తిగా ఇవ్వడం మానేశారు. ఈ నెలలో ఉగాది ఉంది కాని కందిపప్పు ఇవ్వలేదు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధరలు మండిపోతున్నాయి. – ఎం.మాధవి, డిపో నంబరు–127, అల్లిపురం

ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన



జాలారిపేటలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: పలు ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది. మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జాలారిపేట యూపీహెచ్‌సీ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. సీజనల్ వ్యాధులు, అభ ఐడీ, ఇతర ఆరోగ్య పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో రోగులకు సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తైక్వాండోలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విజేతలను అభినందిస్తున్న మధుకుమార్

సీతంపేట: తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా తైక్వాండో సిటీ లీగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని కె.మౌనిక 67 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి, ఉత్తరాఖండ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించిన 31వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ రాష్ట్ర స్థాయి పోటీలలో ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థి కె.బాలు 60 కిలోల విభాగంలో రజత పతకం సాధించాడు. వీరిని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి ఈమధుకుమార్ అభినందించారు.

స్విమ్మింగ్ పోటీల విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందిస్తున్న వరప్రసాద్ తదితరులు

మురళీనగర్: స్థానిక వైశాఖి స్పోర్ట్సు పార్కులోని స్విమ్మింగ్ పూల్‌లో వైశాఖి స్పోర్ట్సు పార్కు, డెకథ్లాన్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. వైశాఖి స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన వారితో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో శిక్షణ పొందిన స్విమ్మర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరికి వైశాఖి స్పోర్ట్సు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, డెకథ్లాన్ ప్రతినిధి మణికుమార్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో పార్కు కార్యదర్శి పీవీ సూర్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు సీతిని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగసిద్ధాంజనేయుడికి ప్రత్యేక పూజలు



వడమాలతో యోగ సిద్ధాంజనేయుడు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్‌లో వెలసిన యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ఆగమ సాంప్రదాయంలో పూజలు చేశారు. సింధూరార్చన, తమలపాకుల పూజ నిర్వహించి స్వామికి వడమాల సమర్పించారు. స్వామి సన్నిధిలో భక్తులు సుందరాకాండ పారాయణ చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.సుబ్బరాజు, ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యాస రచన పోటీలు

గోపాలపట్నం: మండల స్థాయి వ్యాసరచన పోటీలు గోపాలపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం రైతుకు ఏవిధంగా ఉపయోగ పడతుందన్న అంశంపై జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డీసీసీబీ) ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఇందులో 13 పాఠశాలల నుంచి 29 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను బాబూరావు మాస్టారు, జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్ పర్యవేక్షించారు.

యువత పక్షాన పోరాడుతాం



జక్కంపూడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కిరణ్, రవితేజ తదితరులు

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాను నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు తాడి రవితేజ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. యువజన విభాగం అభివృద్ధికి నిర్వహించిన సమావేశంలో ఆయనను రవితేజ కలిశారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ యువతను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్, నార్త్ యువజన విభాగం అధ్యక్షుడు మువ్వల సంతోష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిం మహిళకు వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పేద ముస్లిం మహిళకు రంజాన్ ఖర్చుల కింద రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆశీల్‌మెట్టలో గల తన కార్యాలయంలో మంగళవారం తన సొంత నిధులతో పార్టీ ముస్లిం మైనార్టీ నాయకుల సమక్షంలో షేక్ నజీర్ రహ్మతునిసా జహీదా, షేక్ మహబూబీలకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న అధికారంలో ఉండి ఉంటే పేద ప్రజలకు అండగా ఉండేవారన్నారు. రంజాన్ వేడుకల సందర్భంగా పేద ముస్లింలకు కూటమి ప్రభుత్వం కనీసం సంక్షేమ నిధులు కేటాయించలేని దుస్థితిలో ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి గురజాపు రవి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షకీల్, పలు వార్డుల నాయకులు దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని, పి. అర్జున్ ప్రసాద్, వేణు, సాగర్, మంగరాజు, వాసు, మహ్మద్ నజీమ్, జాకీమ్, డాక్టర్ ఖాసీం, జాఫర్, అనీస్, అజీజ్లా తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కేజీహెచ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట: పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని కేజీహెచ్‌కు వస్తున్న రోగులు, వారి సహాయకుల దాహార్తి తీర్చేందుకు ఆస్పత్రి ఆవరణలో తాగునీరు, మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. మంగళవారం డైట్ సెక్షన్ పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వాసవీలత, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్, ఆర్ఎంవో డాక్టర్ రాజేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ సీహెచ్ పద్మావతి, డైట్ చీఫ్ హనుమంతు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో..

ఏయూక్యాంపస్: బీచ్‌కు వచ్చే సందర్శకులకు దాహార్తిని తీర్చే విధంగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆర్కే బీచ్ ఎదురుగా కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ పోస్ట్ వద్ద స్నోవరల్డ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపీనాథ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీసీపీ జి.మధు సూధనరావు, డీఎస్పీ వై.గోవింద రావు తదిరతులు పాల్గొన్నారు. సాగర తీరానికి వచ్చే సందర్శకులకు మంచినీరు, మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో స్నో స్టేషన్ నిర్వాహకులు బి.ప్రమోద్ కుమార్, వేగేశ్న రాకేశ్ వర్మ, చింతల పాటి సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎంప్లాయిస్ యూనియన్ (సిటు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవీప్రసాద్ తదితరులు

దాబాగార్డెన్స్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 సర్వీస్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ ఇవ్వకుండా ప్రభుత్వమే నేరుగా ఈ సర్వీస్ నిర్వహించాలని ఎంప్లాయిస్ యూనియన్ (సిటు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవీప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జగదాంబ సమీపాన గల సిటు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015 డిసెంబర్ 31న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ఆంధ్ర రాష్ట్రంలో తొలిసారిగా ప్రారంభమైందన్నారు. అప్పటి నుంచి కనీస వేతనాలు అమలు కావడం లేదని, అంతే కాక అప్పటి నుంచి వేతనాలు పెంచలేదన్నారు. 2015లో ఒక పైలెట్‌కు రూ.7870 మాత్రమే వేతనం చెల్లించినట్లు తెలిపారు. ఇప్పటికీ అవే వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఇంక్రిమెంట్లు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో అరబిందో కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్ట్ మార్చి 31తో ముగుస్తుందని, ప్రభుత్వం ఎవరికీ ఈ కాంట్రాక్ట్ ఇవ్వకుండా నేరుగా ఈ సర్వీస్‌ని ప్రభుత్వమే నిర్వహించాలని, ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా తీసుకోవాలని, కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. సిటు జిల్లా ఉపాధ్యక్షురాలు పి. మణి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, లేబర్ కోడ్స్ రద్దు, సమాన పనికి సమాన వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టాల పటిష్టత అమలుకు మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశాఖపట్నం 102 ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పైడా కళాశాల ఫేర్‌వెల్



స్టాప్ డ్రగ్స్ అంటూ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకంలో ఒక దృశ్యం

దాబాగార్డెన్స్: పైడా డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్ మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు.. నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ గల, వివిధ అంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్ బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సరోజ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎస్. కిషోర్‌బాబు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు చదువుపై ఆసక్తి పెంచాలి

గోపాలపట్నం: అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులకు చదువుపై ఆసక్తి పెరిగేలా నడుచుకోవాలని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణకుమారి అన్నారు. అంగన్‌వా కార్యకర్తలకు పోషణ్ బి–పడాయి బీ కార్యక్రమంపై హెచ్‌బీ వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తల్లో సామర్థ్యం పెంచడానికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చినగదిలి, గోపాలపట్నం, ములగాడ మండలాల్లో ఉన్న 150 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారని తెలిపారు. 0 నుంచి 3 ఏళ్ల పిల్లలకు నవ చేతన అని, 3 నుంచి 6 ఏళ్ల పిల్లలకు ఆధార్‌శిల అని నామకరణం చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


పాలిటెక్నిక్‌కు కట్ మోడల్ ఇంజిన్ వితరణ



సమావేశంలో మాట్లాడుతున్న కెన్నడీ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో విద్యార్థుల ప్రయోగాలకు ఉపయోగపడేందుకు ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కట్ మోడల్ డీజిల్ ఇంజిన్‌ను వితరణ చేసింది. ఈమేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కంపెనీ మానవ వనరుల విభాగం జనరల్ మేనేజర్ కెన్నడీ డీజిల్ ఇంజిన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ఇసుజు మోటార్స్ కంపెనీ అంతర్జాతీయంగా వందేళ్ల చరిత్ర కలిగిందన్నారు. కంపెనీ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రయోగాత్మక విజ్ఞానాన్ని పొందేందుకు వీలుగా ఇంజిన్ అందజేశామన్నారు. కంపెనీ లీగల్ డిపార్టుమెంట్ సీనియర్ మేనేజర్ శుక్లా మాట్లాడుతూ విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు ఇష్టంతో కష్టపడాలన్నారు. హెచ్ఆర్ మేనేజర్ నరేష్ మాట్లాడుతూ ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉన్నవారికి మాత్రమే ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, మెకానికల్ హెడ్ మధుకుమార్, మెకానికల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఏజేసీజే న్యాయమూర్తి గంగాభవాని

సీతమ్మధార: పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తామని ఏజేసీజే న్యాయమూర్తి గంగాభవాని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ద్వారకానగర్‌లోని సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో పోక్సో చట్టంపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత సెల్‌ఫోన్లకు ఎక్కువ ఆకర్షితులై ఉపయోగపడని విషయాల పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు. విద్యార్థులు సరైన మార్గంలో నడుస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సూచనలు పాటించాలన్నారు. పోక్సో కేసు నమోదైతే కనీసం ఐదేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థి దశలో చదువుపై ఏకాగ్రత చూపాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పినట్టు నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ద్వారకా సీఐ డీవీ రమణ, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో గైస్ విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులకు నియామక పత్రాలు అందిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ, కంపెనీ ప్రతినిధులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ (గైస్)లో గుజరాత్‌కు చెందిన నారాయణ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కాలేజీకి చెందిన ఆరుగురు విద్యార్థులకు రూ.4.50 లక్షల వార్షిక జీతంతో ఉద్యోగానికి ఎంపిక చేశారని తెలిపారు. వీరిలో పెట్రో కెమికల్ నుంచి ఇద్దరు, కెమికల్ ఇంజినీరింగు నుంచి నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, నారాయణ ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ హెచ్ఆర్ హెడ్ అమిత్రజిత్ సేన్ గుప్తా నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో కంపెనీ టెక్నికల్ హెడ్ రమణ వర్మ, హెచ్ఆర్ మేనేజర్ శ్రీస్తి శుక్ల, గైస్ విభాగాధిపతులు జయప్రకాష్‌రెడ్డి, ప్రశాంత కుమారి, దామోదర్, విజయలక్ష్మి, అసిస్టెంట్ టీపీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పికిల్ బాల్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీ ఝాన్సీ

ఎంవీపీకాలనీ: విశాఖలోని లాసన్స్ బే కాలనీ వేదికగా మూడు రోజులుగా 'బాటిల్ ఆఫ్ ది పాడిల్స్' పేరుతో జరుగుతున్న ఏపీ పికిల్ బాల్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ముగిశాయి. మెన్స్ సింగిల్స్, మెన్స్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహించగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 21, 23, 23 తేదీల్లో ఆయా కేటగిరీల్లో క్రీడాకారులు విజయం కోసం హోరా హోరీగా పోటీపడ్డారు. మెన్స్ సింగిల్స్‌లో హైదరాబాద్‌కు చెందిన సమీర్ వర్మ, మిక్స్‌డ్ డబుల్స్‌లో విశాఖకు చెందిన అనంత్ అండ్ హర్షిణి, మెన్స్ డబుల్స్‌లో హైదరాబాద్‌కు చెందిన సమీర్ శర్మ, ప్రజీత్‌లు విజేతలుగా నిలిచారు. అనంతరం మంగళవారం సాయంత్రం జరిగిన విజేతల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి మాజీ ఎంపీ బొత్సా ఝాన్సీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం ఇలాంటి అంతర్జాతీయ క్రీడలు నిర్వహణ ద్వారా విశాఖ ఖ్యాతి మరింత పెరుగుతందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా విశాఖ యువత దేశానికి ఖ్యాతి తేవాలని సూచించారు. టోర్నమెంట్ నిర్వాహకులు పూజిత, డాక్టర్ బొత్సా సందీప్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పికిల్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టును సందర్శించిన డీఆర్‌ఎం



గంగవరం పోర్టులో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం లలిత్‌బోరా తదితరులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ఉన్నతస్థాయి అధికారుల బృందంతో కలిసి మంగళవారం అదానీ గంగవరం పోర్టును సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. పోర్టులో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల ప్రాజెక్టులు, కీలక ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అదాని గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలిక్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. వ్యాపారాభివృద్ధి కోసం చేపట్టవలసిన విషయాలు, ఇరువురి మధ్య అనుసరించాల్సిన వ్యూహాలు చర్చించి, రైల్వే అధికారులు పలు సూచనలు కూడా చేశారు. తనిఖీలలో డీఆర్‌ఎంతో పాటు సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్ ముఖోపాధ్యాయ్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ పాల్గొన్నారు.

రంగస్థల వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ విద్య: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న ఆంధ్ర యూనివర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు ఆవిష్కరించారు. యూనివర్సిటీ ప్రాంగణంలోని డాక్టర్ కేవీ గోపాలస్వామి ఓపెన్ థియేటర్‌లో తులసి తీర్థం నాటిక, అల్లూరి సీతారామరాజు బుర్రకథ, హాస్య గుళికలు వేణుగానం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ నరసింహారావు తెలిపారు. రంగస్థలం వైభవాన్ని చాటేలా వేడుకలను నిర్వహించాలని వీసీ ఆచార్య రాజశేఖర్ సూచించారు. గోడ పత్రిక ఆవిష్కరణలో రంగస్థలం ఇంచార్జి విభాగాధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మరపట్ల భాస్కరరావు, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ త్రినాథరావు, పితాని ప్రసాద్, సంబంగి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యా విధానంపై అవగాహన

ఎంవీపీకాలనీ: డిగ్రీ విద్యావిధానంపై ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం నూతనంగా డిగ్రీ విధానంలో వచ్చిన మార్పులు, సింగిల్ మేజర్ సబ్జెక్టులు, సింగిల్ మైనర్ సబ్జెక్టులపై విద్యార్థులకు వివరించారు. దీంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సులు, ఆడిట్ కోర్సులు, మల్టీ డిసిప్లినరీ కోర్సులపైనా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.